క్లుప్తంగా

పెండింగ్ పనులు పూర్తి చేయాలి


అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: నియోజకవర్గంలో పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జలమండలి అధికారులకు సూచించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. తాగునీరు, డ్రైనేజీ పైపులైన్ పనుల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. వచ్చే వేసవి కాలంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు అవసరమైన చోట పైపులైన్లు వేసేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తే నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. జలమండలి జీఎం రామకృష్ణ, డీజీఎంలు విష్ణువర్ధన్, సన్యాసిరావు, షాకీర్ తదితరులున్నారు.

ఆకట్టుకున్న స్వరలయరాగ జతుల విన్యాస సమ్మేళనం



చిక్కడపల్లి: ఎన్టీఆర్ నటించిన పౌరాణిక చిత్రాల్లోని పాత్రలను ప్రొఫెసర్ శ్రీదేవి నటించగా.. వరలక్ష్మి, గాయత్రిలు పాడి ప్రేక్షకులను అలరించారు. గురువారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో వీణాపాణి కళానిలయం ఆధ్వర్యంలో వీనస్ జేమ్స్ సౌజన్యంతో నృత్యగానం నటన సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీదేవి, వరలక్ష్మి, గాయిత్రిల నటనా నాట్య వైభవం ఆకట్టుకుంది. మహాలక్ష్మి సహ గాయకులు కృష్ణమోహన్‌తో కలిసి పాటలు పాడారు. ముఖ్య అతిథిగా వ్యక్తిత్వ వికాస నిపుణులు దుర్గ జోన్నలగడ్డ పాల్గొన్నారు.

'ప్రశ్నించే గొంతుకల అణిచివేత'

లిబర్టీ: ప్రశ్నించే గొంతుకలను పాలకులు అణిచివేస్తున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ ఆరోపించారు. మతోన్మాదులకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిని, ప్రశ్నించే వారిని దేశద్రోహులుగా పేర్కొంటూ కేసులు నమోదు చేస్తూ ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తున్నారన్నారు. గురువారం ఆయన మాల మహానాడు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగ మనుస్మృతి సదస్సులో పాల్గొన్న మేధావులు, రచయితలు, ప్రజాస్వామ్యవాదులు, సంపాదకులను అరెస్టు చేయడంపై తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. మనువాద పాలకులు ఎప్పుడూ రాజ్యాంగ వ్యతిరేకులేనని అన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చివేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను దళిత బహుజనులు అడ్డుకొని ప్రతిఘటన పోరాటాలకు సిద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు.

మీకు అండగా మేముంటాం..


భగ్గీఖానా వాసుల సమస్యలు తెలుసుకుంటున్న విజయారెడ్డి

హిమాయత్‌నగర్: 'మీకు అండగా మేముంటాం.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూర్చుతాం' అని ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి అన్నారు. గురువారం డివిజన్‌లోని భగ్గీఖానా ప్రాంతంలో ఆమె హాత్ సే హాత్ జోడో యాత్ర చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రంలో అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేస్తున్న హాత్ సే హాత్ జోడో యాత్రకు మద్దతుగా తాము ఇక్కడ ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. భగ్గీఖానాలోని ప్రతి ఒంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. త్వరలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతున్నదని, వచ్చాక అందరికీ సమన్యాయం చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు జిల్లా శివ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

లాలాపేట: పేద, మధ్య తరగతి ప్రజలు మెరుగైన వైద్యం పొందడానికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో దోహదపడుతుందని డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి అన్నారు. స్వరూపకు మంజూరైన రూ. 58 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును గురువారం తార్నాకలోని ఆమె కార్యాలయంలో అందజేసి మాట్లాడారు.

కోతుల సంగతేంటి.. !

నగరంలో వీధి కుక్కల కారణంగా రోజూ ఏదో ఒక చోట వాటి భారిన పడి గాయాల పాలవుతూనే ఉన్నారు. చిన్నారులు మృత్యువాత పడుతుండగా.. మరి కొందరు తీవ్ర గాయాలపాలై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కళాశాల, పాఠశాల విద్యార్థులు ముఖ్యంగా చిన్నారులు ఇంటి నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు.

- ఓయూ పరిసర ప్రాంతాల్లో బీభత్సం సృష్టిస్తున్న కోతులు
- ఇంటి నుంచి బయటకు రావడానికి జంకుతున్న ప్రజలు



ముషీరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీ చుట్టు పక్కల ప్రాంతాలైన విద్యానగర్, అడిక్‌మెట్, రాంనగర్, ముషీరాబాద్, వారాసిగూడ, పద్మారావునగర్, తార్నాక, హబ్సీగూడ, రామాంతపూర్, అంబర్‌పేట్, డీడీ కాలనీ తదితర ప్రాంతాల్లో కుక్కలకు ఏ మాత్రం తీసిపోకుండా కోతులు బీభత్సం సృష్టిస్తున్నాయి.

- ▲ కోతుల బెడదతో పాదాచారులు, ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో తలుపులు తెరిచి ఉంటే ఇళ్లల్లోకి చొచ్చుకుని వచ్చి కూరగాయలు, పండ్లు, పాలు ఎత్తుకెళ్తున్నాయి.
- ▲ స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు మధ్యాహ్నం వేళల్లో ఆటో దిగి ఇళ్లల్లోకి వెళ్లాలంటే భయపడుతున్నారు. దీంతో తల్లిదండ్రులు ఎదురెళ్లి వారిని ఇళ్లల్లోకి తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.
- ▲ తెల్లవారు జామున 4.30 నుంచి 5 గంటల సమయంలో ఇంటి ముందు పాల ప్యాకెట్లు వేస్తే వాటిని చించేసి పాలు తాగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.
- ▲ రేకులు ఉన్న ఇళ్ల మీద దూకుతూ ఇంట్లో వారికి భయాందోళనకు గురి చేస్తున్నాయి. డాబాల మీద, ఇళ్ల ముందు పూల కుండీలను పారవేసి అందులోని మొక్కలను పీకి వేయడం చేస్తున్నాయి.
- ▲ కోతుల బెడదతో ఇంటి యజమానులు బాంబులను పేల్చి శబ్దం చేస్తుండగా.. వాచ్‌మెన్‌లు గిన్నెలను కొడుతూ వాటిని పారద్రోలే ప్రయత్నం చేస్తున్నారు.
- ▲ పాదాచారులు ప్లాస్టిక్ కవర్లతో అటుగా వెళ్తే ఒకేసారి మీదపడి ఆ కవర్లను లాక్కొని వెళ్తున్నాయి. ఎవరైనా ఎదురుతిరిగి భయపెట్టడానికి ప్రయత్నిస్తే వారిపై ఒక్కసారిగా దాడి చేస్తూ గాయాలు చేస్తున్నాయని పలువురు వాపోతున్నారు.
- ▲ తాజాగా లక్ష్మి అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ కుమారుడిపై కోతులు దాడి చేయగా గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నాడు.
- ▲ విద్యానగర్ చౌరస్తాలో జైపాల్‌రెడ్డి అనే వ్యాపారిపై ఇటీవల కోతులు దాడి చేసి అతడి చొక్కా మొత్తం చిరిగిపోగా.. వాటి భారి నుంచి తప్పించుకున్నాడు.

అదనపు బృందాలు ఏర్పాటు చేయాలి



జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి చెప్పినట్లు కుక్కలను పట్టుకునేందుకు ఇప్పుడు ఉన్న 30 బృందాలు ఏ మాత్రం సరిపోవు. మరో 30 బృందాలను అదనంగా ఏర్పాటు చేసి కుక్కలతో పాటు కోతుల నివారణకు చర్యలు చేపట్టాలి. విద్యానగర్, అచ్చుతరెడ్డి మార్గ్ తదితర ప్రాంతాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. జీహెచ్‌ఎంసీ అధికారులు పరిస్థితిని గుర్తించి సమస్యను పరిష్కరించాలి.

– అనురాధా, విద్యానగర్ నివాసి

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు



రాంనగర్‌లోని బండారు దత్తాత్రేయ గల్లీలో 20–30 కుక్కలు తిరుగుతుంటాయి. రాత్రే ఒంటరిగా వెళ్తున్న నాపై దాడికి ప్రయత్నించాయి. వెంటనే జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేసి 24 గంటలైనా ఎలాంటి స్పందన లేదు. ఈ గల్లీలో ఓ వ్యక్తి కుక్కలకు ఆశ్రయం ఇస్తున్నాడు. దీనిపై కూడా గతంలో ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదు. జీహెచ్‌ఎంసీ అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నాం.


– కాకునూరి సుధాకర్, రాంనగర్ నివాసి

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ అమృత

నల్లకుంట: కేంద్రం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నల్లకుంట కార్పొరేటర్ వై. అమృత బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి నల్లకుంట డివిజన్ రత్నానగర్‌లో 'ప్రజా గోస– బీజేపీ భరోసా' కార్నర్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమిలేదని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు వనం రమేష్, ఓబీసీ మోర్చా కార్యదర్శి ఎంబీ. కిశోర్‌కుమార్, బీజేపీ డివిజన్ ఉపాధ్యక్షుడు మహేష్, రత్నానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ తదితరులున్నారు.

రేపటి నుంచి త్యాగరాజ స్వామి ఆరాధన సంగీత ఉత్సవాలు


త్యాగరాజ స్వామి

నల్లకుంట: శ్రీరామ గాన సభ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి మార్చి 5 వరకు త్యాగరాజ స్వామి 54వ వార్షిక ఆరాధనా సంగీతోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని గాన సభ కార్యదర్శి శ్రీనివాసశర్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సంగీత ఆరాధనోత్సవాల్లో సంగీతాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

యువతి ఆత్మహత్య

అంబర్‌పేట: మానసిక ఒత్తిడితో ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బర్కత్‌పురలో నివసించే ప్రకాష్ కూతురు హన్సిక (29) ప్రైవేటు ఉద్యోగం చేస్తుంది. ఆమె గత కొంత కాలంగా మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు సమాచారం. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో తన గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుంది. గమనించిన తల్లిదండ్రులు వెంటనే కిందకు దించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భాగస్వామ్యంతోనే విద్యారంగ సమస్యలు పరిష్కారం


మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మారంపల్లి లక్ష్మీనారాయణ తదితరులు

కవాడిగూడ: రాష్ట్రంలో విద్యా విధానంలో మౌలిక మార్పులు తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యమైనప్పుడే విద్యారంగ సమస్యలతో పాటు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మీనారాయణ అన్నారు. ఉపాధ్యాయులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల తరపున నిలబడి పోరాటం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. నామినేషన్ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం, తెలంగాణ రాష్ట్ర బహుజన సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం ఇందిరాపార్కు వద్ద సమావేశమయ్యారు. అనంతరం ఇందిరాపార్కు చౌరస్తా, దోమలగూడ, గగన్‌మహల్ మీదుగా జీహెచ్‌ఎంసీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బడ్జెట్‌లో విద్యారంగం అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు కొంగల వెంకట్, ప్రధాన కార్యదర్శి దానయ్య, గౌరవ అధ్యక్షులు అంజయ్య, నాయకులు భాస్కర్, బాలు, సుశీల, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

సీసీఎంబీలో పూర్వ విద్యార్థుల సమావేశం

లాలాపేట: సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలుక్యూలర్ బయాలోజీ(సీసీఎంబీ)వ్యవస్థాపక డైరెక్టర్ పుష్ప మిత్ర భార్గవ జయంతి, వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సీసీఎంబీలో పీహెచ్‌డీ పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. ఆధునిక జీవశాస్త్రంలో దూరదృష్టి కల్గిన శాస్త్రవేత్త అని పీఎం భార్గవ చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కణత్వచం ఫ్యాబ్రిక్ లాంటి స్వభావం దాని పొరను అర్థం చేసుకోవడానికి భౌతిక, జీవ శాస్త్రవేత్తలు ఏ విధంగా కలిసారు అనే అంశంపై నేషనల్ సెంటర్ ఫర్ బయోలాజికల్ సైన్సెస్ ప్రొఫెసర్ సత్యజిత్ మేయర్ ఉపన్యాసం చేశారు. ఇలాంటి సమావేశాల ద్వారా ఫెలోషిప్‌లు, పరిశోధనలకు అవసరమైన ఫండింగ్ అవకాశాలు లభిస్తాయన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం



కవాడిగూడ: క్రీడారంగంలో ప్రపంచ దేశాలకు దీటుగా భారతదేశాన్ని నిలబడటమే ప్రధాని మోదీ ప్రభుత్వం లక్ష్యమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యరెడ్డి అన్నారు. 'ఖేల్ తెలంగాణ, జీతో తెలంగాణ' పోటీలో భాగంగా ఆమె మాట్లాడుతూ.. పేద క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ పరిధిలో 'ఖేలో సికింద్రాబాద్, జీతో సికింద్రాబాద్' ను నిర్వహిస్తున్నామన్నారు. గురువారం దోమలగూడ ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో జరుగుతున్న క్రికెట్, ఖోఖో పోటీలను ఆమె సందర్శించి క్రికెట్ క్రీడాకారులకు స్థానిక కార్పొరేటర్ జి.రచనశ్రీతో కలిసి కిట్లను అందజేశారు. బీజేవైఎం నగర అధ్యక్షుడు శివాజీ, నగర మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్, ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ రమేష్‌రాం, నగర నాయకులు వెంకటేష్, కవాడిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్‌బాబు, ప్రభాకర్‌గంగపుత్ర, కుమార్‌గౌడ్, శ్రీనివాస్‌ముదిరాజ్, రమేష్‌గౌడ్, యువ మోర్చా నాయకులు దిలీప్‌యాదవ్, అనిల్‌కుమార్, సుదాన్షు, నవీన్, శక్తిసింగ్ తదితరులున్నారు.

గంజాయి విక్రేతకు జరిమానా.. ఐదేళ్ల జైలు శిక్ష

అంబర్‌పేట: మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న ఓ వ్యక్తికి ఐదేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా శిక్షపడింది. గురువారం అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం ... మంగల్‌హాట్‌కు చెందిన సురజ్‌సింగ్ కుమారుడు విశాల్‌సింగ్ (22) 2017 జనవరిలో అంబర్‌పేట బాపూనగర్ అనుమానాస్పద స్థితిలో తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసుల తనిఖీల్లో అతడి వద్ద 9.8 కిలోల గంజాయి బయటపడింది. దీంతో కేసు నమోదు చేసి కోర్టు ఎదుట హాజరు పరిచామన్నారు. కోర్టు విచారణలో నేరం రుజువు కాగా.. నాంపల్లి ఎంఎస్‌జే కోర్టు నిందితుడు వినయ్‌సింగ్‌కు ఐదేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా విధించినట్లు అడిషనల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తథ్యం

మలక్‌పేట: రాబోయే ఎన్నికల్లో అధికార బీఆర్‌ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ ఎస్సీ మోర్చా నేషనల్ మీడియా ఇన్‌చార్జి, భాగ్యనగర్ జిల్లా ఇన్‌చార్జి ఎస్.కుమార్ అన్నారు. మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, కోశాధికారి రమేష్‌రెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌తో కలిసి డివిజన్ పరిధిలోని రాజరాజేశ్వరి టెంపుల్ లైన్‌లో గురువారం జరిగిన కార్నర్ మీటింగ్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ పథకాలు, పార్టీ విధానాలు ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న నిరంకుశ విధానాలపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. శక్తి కేంద్రం ఇన్‌చార్జి గౌర దేవేందర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాయకులు కొప్పుల దినేష్‌కుమార్, జక్కా మోహన్‌రెడ్డి, ఉదయ్, చరణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఈఎస్ వెబ్‌సైట్‌లో పోర్న్ చిత్రాలు

- వెబ్‌సైట్ హ్యాక్ అయ్యిందని సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు
- దర్యాప్తు చేపట్టిన సైబర్‌క్రైం పోలీసులు

హిమాయత్‌నగర్: 'తెలంగాణ స్టేట్ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ సొసైటీ(టీఎస్ఈఎస్) అధికారిక వెబ్‌సైట్ హ్యాక్‌కు గురైంది. ప్రస్తుతం ఈ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేస్తే దీనిలో పోర్న్ చిత్రాలు ప్రత్యక్షమవుతున్నట్లు సెక్రటరీ హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు స్వీకరించిన ఏసీపీ కేవీఎం ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ ఎఫైర్స్ కింద పనిచేసే 'టీఎస్ఈఎస్'ను గుర్తు తెలియని వారు హ్యాక్ చేశారు. ఈ వెబ్‌సైట్ ఓపెన్ చేస్తే దానిలో పోర్న్ కంటెంట్‌తో కూడిన చిత్రాలు, వీడియోలు కనిపిస్తున్నాయి. ఈ వెబ్‌సైట్ స్టూడెంట్స్ వారి తల్లిదండ్రులకు అనుసంధానమై ఉంటుందని, సదరు వెబ్‌సైట్‌లో పోర్న్ కంటెంట్ ఉండటంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బడ్జెట్ పాఠశాలలుగా గుర్తించాలని మంత్రికి వినతి


మంత్రి సబితాఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ట్రస్మా సభ్యులు

కవాడిగూడ: 'తెలంగాణ రికగ్నైజ్డ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్' (ట్రస్మా) రూ.40 వేల లోపు ఫీజులు తీసుకునే పాఠశాలలను బడ్జెట్ పాఠశాలలుగా గుర్తించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్.రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిని ఆమె నివాసంలో కలిసి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

- ◆ తక్కువ ఫీజులున్న పాఠశాలల్లో పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుతున్నారని వారికి ప్రత్యేక మినహాయింపులు ఇవ్వాలని కోరారు.
- ◆ బడ్జెట్ పాఠశాలకు బిల్డింగ్, ప్రాపర్టీ ట్యాక్స్‌ను డోమెస్టిక్ ట్యాక్స్‌గా మార్చాలని కోరామన్నారు.
- ◆ విద్యుత్ బిల్లులు, నీటి బిల్లులను కమర్షియల్ నుంచి డొమెస్టిక్‌గా మార్చాలని, పదేళ్లు పూర్తి చేసుకున్న ప్రతీ పాఠశాలకు శాశ్వత గుర్తింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశామన్నారు.
- ◆ పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బందికి హెల్త్ కార్డులు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందజేయాలన్నారు. ప్రొఫెషనల్ ట్యాక్స్‌ను 2023–24 నుంచి అమలు చేయాలని ట్రేడ్ లైసెన్స్‌ల నుంచి మినహాయింపు ఇవ్వాలని పేర్కొన్నారు. న్యాయమైన డిమాండ్లను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి చర్చించి సానుకూలమైన నిర్ణయం తీసుకుంటామని మంత్రి సబిత హామీ ఇచ్చినట్లు సమాచారం.

ట్రస్మా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, అసోసియేషన్ ప్రెసిడెంట్ బుచ్చిరెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ మహాసభలు



ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ సమావేశాల్లో అభివాదం చేస్తున్న నాయకులు


జెండాను ఆవిష్కరిస్తున్న దేబబ్రత బిశ్వాస్


సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ 19 వ జాతీయ మహాసభలు అట్టహాసంగా జరిగాయి. సభకు ముందు బాగ్‌లింగంపల్లిలో భారీ ప్రదర్శన నిర్వహించి ఫార్వర్డ్ బ్లాక్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల స్తూపానికి, ఫార్వర్డ్ బ్లాక్ వ్యవస్థాపకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గురువారం జాతీయ ప్రధాన కార్యదర్శి దేబబ్రత బిశ్వాస్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం, అసమానతలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో వామపక్ష శక్తులన్నీ ఏకమై అలుపెరగని పోరాటాలకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. వామపక్షాల ఐక్యమత్యంతోనే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందన్నారు.

- ◆ సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ.. ఫాసిజం, సామ్రాజ్యవాదం, సాదనం మళ్లీ పుంజుకుటుందని ప్రపంచ శాంతి ప్రమాదంలో ఉందన్నారు. సామాజిక న్యాయ సూత్రాలు ప్రమాదంలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.
- ◆ దేశంలో ధరల పెరుగుదల తీవ్ర అసమానతలు, బలవంతపు వలసలు, సహజ వనరుల విధ్వంసం, ఆవాసాల నష్టం జీవితాలను సమూలంగా మారుస్తున్నాయన్నారు.
- ◆ కొన్ని గుత్తాధిపత్యాలు వేలకోట్లు పోగు చేసుకుంటుంటే మరో వైపు కోట్లాది మంది తమ జీవనోపాధి కోల్పోయి తీవ్ర పేదరికంలో పడిపోయారన్నారు. పోషక లోపంతో ఉన్న వారి సంఖ్య 130 మిలియన్లకు పైగా పెరిగిందన్నారు.
- ◆ లౌకిక ప్రజాస్వామిక ప్రత్యామ్నాయాన్ని అభివృద్ధి చేసేందుకు అన్ని లౌకిక ప్రజాతంత్ర, వామపక్ష శక్తులతో కూడిన విస్తృత కూటమిని నిర్మించడం తక్షణ అవసరమన్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన సీపీఐ 24వ మహాసభలు నిర్ణయించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.
- ◆ పీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు సుభాషిని అలీ మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటుందని ప్రజా పంపిణీ వ్యవస్థను బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు.
- ◆ దేశ వనరులను కార్పొరేట్ చేతుల్లో పెడుతున్నారని రైతుల భూములను స్వాధీనం చేసుకునేందుకే వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చారని విమర్శించారు. దేశంలోని 29 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి సుమారు 600 మంది ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ డిప్యూటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కతిరావన్, కేంద్ర కార్యవర్గ సభ్యులు దేవరాజన్, జీ.ఆర్.శివశంకర్, నరేన్‌చటర్జీ, గోబిందరాయ్, జ్యోతిరాజన్, ఆర్‌ఎస్‌పీ జాతీయ నాయకులు, ఎంపీ ప్రేమ్‌చంద్రన్, సీపీఐఎంఎల్ జాతీయ నాయకులు ఎస్.మూర్తి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్, ఉపాధ్యక్షులు జోజిరెడ్డి, కార్యదర్శి తేజదీప్‌రెడ్డి, ఏఐఎస్‌బీ ప్రధాన కార్యదర్శి వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పీజీ–సీయూసెట్‌కు ఉచిత శిక్షణ

ఉస్మానియా యూనివర్సిటీ: దేశంలోని సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశాలకు నిర్వహించే పీజీ–సీయూసెట్–23 ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. హెచ్‌సీయూ వెనుక శేరిలింగపల్లి సమీపంలోని పూలే–అంబేడ్కర్ సెంటర్ ఫర్ ఫిలాసఫికల్ అండ్ ఇంగ్లిష్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఎంఏ పొలిటికల్ సైన్స్,ఎంఏ ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో ప్రవేశాలకు నెల రోజుల శిక్షణ, ఉచిత హాస్టల్ వసతి, భోజనంతో పాటు మెటీరియల్ అందచేయనున్నట్లు డైరెక్టర్ డాక్టర్ బాలబోయిన సుదర్శన్ తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్, సవరాలబస్తీ తదితర ప్రాంతాల్లో తాగునీరు లోప్రెషర్‌తో వస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని బీఆర్‌ఎస్ నాయకుడు పాగర్తి భువన్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులకోసారి సరఫరా చేసే మంచినీరు కేవలం రెండు బిందెలు మాత్రమే వస్తున్నాయని, జలమండలి అధికారులకు ఫిర్యాదు చేస్తే వచ్చి చూసి వెళ్తున్నారే తప్ప సమస్య పరిష్కారం కాలేదన్నారు. వేసవి ప్రారంభమైన నేపథ్యంలో సమస్య మరింత తీవ్రతరం అవుతుందని, ఉన్నతాధికారులు స్పందించి నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలన్నారు.